7

సాక్షి విశాఖపట్నం

గురువారం। 22। మే। 2025



యోగాసనాలు వేస్తున్న ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు

ఆరోగ్యమే మహాభాగ్యం

8లో


న్యూస్‌రీల్

సీఎస్‌ఆర్‌ఎంవోగా డాక్టర్ శ్రీహరి



మహారాణిపేట: కేజీహెచ్‌లో ఎట్టకేలకు సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్(సీఎస్‌ఆర్ ఎంవో) పోస్టు భర్తీ అయింది. ఎన్నో ఏళ్లుగా ఈ పోస్టు భర్తీ కాలేదు. ఇన్‌చార్జిలతో ఈ పోస్టు నడుస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతి వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీహరిని కేజీహెచ్ సీఎస్‌ఆర్‌ఎంవోగా నియమించారు. ఈ మేరకు బుధవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా డీఎస్‌ఆర్ ఎంవో డాక్టర్ మోహర్ కుమార్ పనిచేస్తున్నారు. తొలుత కేజీహెచ్‌కు చేరుకున్న డాక్టర్ సీహెచ్ శ్రీహరి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలువురు వైద్యులు, సిబ్బంది ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

8 మంది సిబ్బందికి పదోన్నతి



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషరేట్ పరిధిలో 8 మంది సిబ్బందికి పదోన్నతి లభించింది. నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా, ముగ్గురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా, ఒక ఏఆర్ పీసీకి హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ దక్కింది. వీరికి బుధవారం ర్యాంకులతో పాటు పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు.

307 మంది రివార్డులు

పలు కేసుల పరిష్కారంలో ప్రతిభ కనబరిచిన 307 మంది పోలీస్ సిబ్బందికి రివార్డులు అందజేశారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం, చోరీ కేసుల పరిష్కారం, సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుల అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ స్థాయి నుంచి హోంగార్డుల వరకు సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి రివార్డు ఆర్డర్లు అందజేశారు. అనంతరం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ట్రాఫిక్, క్రైం, లా అండ్ ఆర్డర్ విభాగాల పనితీరును సమీక్షించారు. నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో కేసుల నమోదు, ఫిర్యాదుదారులతో అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు.

విశాఖకు ఇన్‌స్పెక్టర్ ఉమాకాంత్

విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ సీహెచ్. ఉమాకాంత్‌ను విశాఖ నగరానికి బదిలీ చేశారు. ఈ మేరకు డీఐజీ గోపీనాథ్ జెట్టీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో(ఐటీఐ) 2025–26 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు https://iti.ap.gov.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలకు ఈ ఒక్క దరఖాస్తు సరిపోతుందన్నారు. అనంతరం విద్యార్థులు తమకు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐ కార్యాలయానికి వెళ్లి తమ విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని ఆమోదం పొందాలన్నారు. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.



నెహ్రూబజార్ ఏరియాలో ఎండీయూ వాహనం ద్వారా సరకులు అందుకుంటున్న కార్డుదారులు

రేషన్ బండి.. ఇంటింటికీ రాదండి!

కష్టం తెలియకుండా ఇంటి వద్దే రేషన్ తీసుకోవడం ఇక గత చరిత్రే. టీడీపీ ప్రభుత్వ నిత్యకృత్యాలైన నిత్యావసరాల కోసం కిలోమీటర్ల మేర కాలినడక, నెత్తిన బరువుల మోత, గంటల తరబడి నిరీక్షణ మళ్లీ ప్రజలు అనుభవించాల్సిందే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సౌకర్యార్థం అమల్లోకి తెచ్చిన ఒక్కో పథకాన్ని నీరుగార్చే ప్రక్రియలో కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. తాజా నిర్ణయంతో జిల్లాలోని 351 ఎండీయూ వాహనాల డీలర్లు, సహాయకుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

- ఎండీయూ వాహనాలకు మంగళం
- జిల్లాలో 351 ఎండీయూ వాహనాలు
- రోడ్డున పడ్డ 702 కుటుంబాలు
- జూన్ 1 నుంచి రేషన్ డిపోల ద్వారానే సరకులు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలకు భారాలు, కష్టాలు మొదలయ్యాయి. ఒకవైపు అన్నింటిపైనా భారం మోపుతూ.. మరోవైపు ఉన్న సౌకర్యాలను దూరం చేస్తోంది. తాజాగా ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో నెలా నెలా ఠంచనుగా ఇంటి వద్దకే వచ్చే రేషన్(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్–ఎండీయూ) బండికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. నిత్యావసరాల కోసం ప్రజలు ఇబ్బంది పడరాదన్న ఆశయంతో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమానికి స్వస్తి పలికింది. ఇప్పటికే కార్డుదారులకు అరకొర సరుకులను అందిస్తున్న ప్రభుత్వం.. జూన్ 1 నుంచి ఎండీయూ వాహనాలతో రేషన్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంపై ఎండీయూ ఆపరేటర్లు భగ్గుమంటున్నారు.

ప్రజల ఇబ్బందులు తీర్చాలనే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక ముందు రేషన్ సరకులు తీసుకోవడం ఓ ప్రహసనం. రోజంతా పనులు మానుకుని మరీ రేషన్ డిపోల దగ్గర పడిగాపులు కాసేవారు. బియ్యానికి ఒక రోజు, పంచదారకు ఓ రోజు.. ఇలా ఒక్కో సరకుకు ఒక్కో రోజున వెళ్లాల్సి వచ్చేది. చాంతాడంత లైన్లలో గంటల తరబడి నిరీక్షించేవారు. ఇక సర్వర్లు మొరాయిస్తే ఉసూరుమంటూ తిరుగుముఖం పట్టాల్సిందే. ఈ కష్టాలను తెలుసుకున్న గత సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జనవరి 2021లో ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి నుంచి ఇంటి ముందుకే వ్యాన్ల ద్వారా సరకులు అందించడం మొదలెట్టారు. దీంతో రేషన్ కోసం తిప్పలు పడాల్సిన పని తప్పింది.

జిల్లా వివరాలు

తెలుపు రేషన్ కార్డులు	5,12,619	ఎండీయూ వాహనాలు	351
చౌక ధరల డిపోలు	625	ఆధారపడ్డ సిబ్బంది	702

ఆరేళ్లకు అగ్రిమెంట్

నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎండీయూ వాహనాలను బ్యాంకు రుణాల ద్వారా ఇప్పించి, ఆరేళ్ల(72 నెలలు)కు అగ్రిమెంటు చేశారు. జనవరి 2027 వరకు ఆ గడువు ఉంది. అప్పటికి వాహనాల బ్యాంకు రుణాలు కూడా దాదాపు ముగిసి, వాహనం నిరుద్యోగ యువత సొంతమవుతుంది. అయితే 20 నెలల ముందుగానే దీనికి ముగింపు పలకడంతో ఎండీయూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డున పడ్డ సిబ్బంది

ఈ పథకం ద్వారా జిల్లాలో 351 మంది ప్రత్యక్షంగా, మరికొంత మంది పరోక్షంగా బతుకున్నారు. నెలకు కుటుంబానికి సరిపడా వచ్చే సొమ్ముతో ప్రణాళిక రూపొందించి అమలు చేశారు. ఇప్పుడు అర్ధంతరంగా ఈ పథకానికి మంగళం పలకడంతో ఆపరేటర్లు, ఇతర సిబ్బంది రోడ్డున పడ్డారు. దశల వారీ ఆందోళన కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. దీనిపై రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్తు ప్రణాళికను రూపొందించనున్నారు.

అగ్రిమెంట్ గడువు ఇంకా ఉంది



2027 జనవరి వరకు అగ్రిమెంటు ఉంది. ఇంతలోనే తొలగించడం అన్యాయం. ఒక వేళ తొలగిస్తే రానున్న 20 నెలల జీతాలు చెల్లించాలి. కరోనా సమయంలో ఎండీయూ డీలర్లు ఎన్నో సేవలు అందించారు. వైరస్‌కు భయపడకుండా పనిచేశారు. రాజకీయ కారణాలతో తీసుకున్న నిర్ణయాల వల్ల మేమంతా రోడ్డున పడతాం. మా కుటుంబాలకు అన్యాయం చేయొద్దు.

– **ఎస్.సతీష్ కుమార్**, అధ్యక్షుడు, ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఈ వాహనాల మీదే ఆధారపడి బతుకుతున్నాం. ఎండీయూ ఆపరేటర్లకు న్యాయం చేయాలి. వీటిపై వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఇప్పుడు ఆకస్మాత్తుగా నిలుపుదల చేయడంతో రోడ్డున పడ్డాం. ఈ వయస్సులో ఎక్కడకైనా వెళ్లి పనిచేయలేం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. మాలాంటి చిన్నస్థాయి బతుకులకు రాజకీయాలు అంటగట్టడం సరికాదు.

– **నీరు కొండ సతీష్**, ఎండీయూ ఆపరేటర్

ఉపాధ్యాయుల బదిలీలు షురూ

- తొలుత గ్రేడ్–2 హెచ్‌ఎంలకు బదిలీ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 93 ఖాళీలు
- మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులకే చోటు
- ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్



విశాఖ విద్య: విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. బుధవారం నుంచి బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో, ఇందుకనుగుణంగా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచారు. గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులు 93 ఖాళీగా ఉన్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. క్లియర్ వేకెన్సీ 46 పోస్టులు ఉండగా, రేషనలైజేషన్‌లో భాగంగా 24 పోస్టులు ఖాళీ చూపించారు. ఫారిన్ సర్వీసుపై వెళ్లిన వారి ఖాళీలు రెండు ఉన్నాయి. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ అయ్యే జాబితాలో 15 మంది లెక్క తేలారు. వీరు గురువారం సాయంత్రం 5 గంటల్లోగా బదిలీ కోసమని దరఖాస్తు చేసుకోవాలి. కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ జాబితాలో ఉన్న వారెవరైనా బదిలీ చేయనట్లయితే, వారికి చివరిగా మిగిలిన ఖాళీల్లో పోస్టింగ్ కేటాయించనున్నారు. ఇదిలా ఉండగా, బాలికల పాఠశాలలో 50 ఏళ్ల లోపు ఉన్న వారిని కూడా బదిలీ చేస్తున్నారు. ఇలా ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు గుర్తించి, వారి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీరు కూడా తప్పనిసరిగా బదిలీ కోసమని దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. బదిలీల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని డీఈవో వెల్లడించారు. విశాఖలోని సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో పనిచేస్తున్న అన్ని క్యాడర్‌ల వారీగా ఖాళీల జాబితాలను సిద్ధం చేస్తున్నామన్నారు.

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి బ్రేక్

కౌన్సెలింగ్ వాయిదా

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా గురువారం నుంచి జరిగే కౌన్సెలింగ్‌కు బ్రేక్ పడింది. ముందు అనుకున్న ప్రకారం ఈ నెల 22, 23 తేదీల్లో ఎంపిక అయిన అభ్యర్థులకు కౌన్సెలింగ్, పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమం కూడా చేపట్టాలని భావించారు. అయితే కౌన్సెలింగ్, పోస్టింగ్ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని, సాధారణ బదిలీలు పూర్తి అయిన తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించాలని పలు సంఘాలు ఒత్తిడి చేశాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి కూడా ఆదేశాలు రావడంతో నేటి నుంచి జరగాల్సిన కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి తెలిపారు.

కొనసాగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె రెండవ రోజు కొనసాగింది. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లపై మంగళవారం నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు దిగాయి. మంగళవారం 61.8 శాతం మంది విధులకు హాజరు కాగా, బుధవారం 68 శాతం మంది విధులకు హాజరయ్యారు. అయితే మొదటి రోజు విధులకు హాజరైన కార్మికులు రెండవ రోజు గైర్హాజరు కావడం, మొదటి రోజు గైర్హాజరైన కార్మికులు రెండవ రోజు విధులకు హాజరు కావడం వంటి సంఘటనలు జరిగాయి. మొదటి రోజు కంటే రెండవ రోజు హాజరు కొంత మేర పెరగడం కాంట్రాక్ట్ కార్మిక సంఘాలకు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, కార్మికులకు తొలగింపులపై జరిగే పరిణామాలను వారు వివరిస్తున్నారు. కాగా.. ముఖ్య విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య సరిపోయేంతగా ఉండటం వల్ల అత్యవసర విధులకు వెళ్లిన అధికారులకు పని లేకుండా పోయింది. వారు మరలా తమ విభాగాలకు వచ్చి యథావిధిగా విధులు నిర్వహించుకుంటున్నారు. సమ్మె ప్రారంభమైన తర్వాత యాజమాన్యం కార్మిక సంఘాలను చర్చలకు పిలవకపోవడంతో ఇరు వర్గాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది.

ముంచెత్తిన వాన



సిరిపురంలో కురుస్తున్న వర్షం

మహారాణిపేట : నగరంలో బుధవారం జోరుగా కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోజులో పలుమార్లు తెరిపి ఇస్తూ వర్షం కురిసింది. రుతుపవనాల ముందస్తు ప్రభావం, అల్పపీడన ద్రోణి వల్ల జిల్లాలో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భారీగా వర్ష పాతం నమోదయింది. గత కొన్ని రోజులుగా పగటి పూట ఎండల తీవ్రతకు విశాఖ వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బుధవారం వర్షం.. తర్వాత ఎండ.. చిత్రమైన వాతావరణం నెలకొంది.



సిరిపురం జంక్షన్‌లో నిలిచిన వర్షపు నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

భారీ వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జ్ఞానాపురం రైల్వే వంతెన వర్షపు నీటితో నిండిపోయింది. డాబాగార్డెన్స్ నైట్ ఫుడ్ కోర్టు వద్ద కూడా వర్షపు నీరు చేరిపోయింది. పూర్ణామార్కెట్, రైల్వే స్టేషన్ రోడ్డు, డాబాగార్డెన్స్, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, చావులమదుం, అక్కయ్యపాలెం, వెలంపేట, ఆశీలమెట్ట, కంచరపాలెం, ఎస్పీడీ కొత్తరోడ్డు, పాతపోస్టాఫీసు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. విశాఖలో ఎయిర్‌పోర్టు వద్ద 47 మి.మీ., పెందుర్తిలో 35.75 మి.మీ., గోపాలపట్నంలో 45.75 మి.మీ. వర్షపాతం నమోదయింది.

విశాఖలో టూరిజం సర్క్యూట్

- ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై మంత్రి నారాయణ సమీక్ష
- అమరావతిపైనే కాదు.. విశాఖపై కూడా దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేల విజ్ఞప్తి



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

విశాఖ సిటీ: విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం సర్క్యూట్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఏకరవు పెట్టారు. జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని, నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని, పుష్ కార్ట్‌లు లేకపోవడంతో పారిశుధ్య పనులకు ఇబ్బందులు, 2014లో పేదల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం డీడీలు కట్టించుకున్న వారికి ఇళ్ల స్థలాల మంజూరు, సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఏకపక్ష నిర్ణయాలు వద్దు : ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, ప్రాజెక్టుల విషయంలో అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదని ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతితో పాటు విశాఖపై కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. దీనిపై మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. కోస్టల్ కారిడార్ నుంచి భీమిలి వరకు బీచ్ కారిడార్ అభివృద్ధిపై కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వీకేపీసీపీఐఆర్, మాస్టర్‌ప్లాన్–2041, ఎంఐజీ లేఅవుట్లు, ప్రతిపాదిత లేఅవుట్లు, మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణాలు, తీర ప్రాంత కొత్త ప్రాజెక్టు, కైలాసగిరి, రుషికొండ సమగ్రాభివృద్ధి, భోగాపురం నుంచి రాంబిల్లి వరకు సెమీ రింగ్ రోడ్డు, సింహాచలం స్థలాలకు సంబంధించిన సమస్యలు, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్ వంటి అంశాలపై చర్చించారు. ఇకపై ప్రతి నెలా సమావేశం నిర్వహించి ఉత్తరాంధ్ర అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సంపత్ కుమార్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు హరేందిర ప్రసాద్, విజయకృష్ణన్, అంబేడ్కర్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్ పాల్గొన్నారు.



కూటమిలో కుమ్ములాట

- టీడీపీ, జనసేనల మధ్య భగ్గుమన్న విభేదాలు
- పెందుర్తిలో పంచకర్ల, గండిల మధ్య అగాథం
- యలమంచిలిలో సుందరపు, ప్రగడల మధ్య విరోధం
- వీఎంఆర్డీఏ సమీక్షకు సమన్వయకర్తలు రావడంపై ఎమ్మెల్యేల ఆగ్రహం
- తమకు విలువ ఇవ్వడం లేదని జనసేన ఎమ్మెల్యేల మండిపాటు
- ఒకరిపై ఒకరు కేకలు వేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి

విశాఖ సిటీ: కూటమి కోటలు బీటలు వారుతున్నాయి. టీడీపీ, జనసేన నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ప్రధానంగా జనసేన ఎమ్మెల్యేలు, టీడీపీ సమన్వయకర్తల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జనసేన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో టీడీపీ సమన్వయకర్తల పెత్తనాన్ని జనసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్నాళ్లు కక్కలేక.. మింగలేక ఉన్న జనసేన ఎమ్మెల్యేలు ఉత్తరాంధ్ర అభివృద్ధి సమీక్షకు వచ్చిన మంత్రుల ముందు తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. వీఎంఆర్డీఏ చైర్మన్ చాంబర్‌లో ఒకరిపై ఒకరు అరుచుకుంటూ బాహాబాహీకి దిగారు. దీంతో వారికి సర్ది చెప్పలేక మంత్రి, స్పీకర్ తలలు పట్టుకున్నారు.

పెద్ద పెద్ద అరుపులు.. కేకలు

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏలో ఉదయం 10 గంటలకు సమీక్ష సమావేశం ప్రారంభం కావాల్సి ఉంది. అయితే విజయనగరం, అనకాపల్లి జిల్లాల నుంచి కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆలస్యంగా వచ్చారు. ఈ సమయంలో మంత్రి నారాయణ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ చాంబర్‌లో కూర్చున్నారు. కొంతసేపటికి లోపల నుంచి పెద్ద పెద్ద అరుపులు, కేకలు బయటకు వినిపించడంతో అక్కడున్న వారందరూ విస్తుపోయారు. చాంబర్‌లో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాలేదు. అక్కడున్న పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు.

సమీక్షకు సమన్వయకర్తలు రావడంపై ఆగ్రహం

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి సమీక్ష సమావేశంలో పార్టీ సమన్వయకర్తలు హాజరుకావడంపై జనసేన ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారిక సమావేశానికి పార్టీ నేతలను ఎలా ఆహ్వానిస్తారని ఆగ్రహం వెలిబుచ్చారు. ముందుగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఈ విషయాన్ని లేవనెత్తినట్లు సమాచారం. నియోజకవర్గంలో సమన్వయంతో పనిచేయాలని అధినేత ఆదేశించడంతో సర్దుకుపోతూ పనిచేస్తుంటే.. టీడీపీ ఇన్‌చార్జి మాత్రం తమకు విలువ ఇవ్వకుండా నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడి ముందు తన గోడును వెళ్లగక్కినట్లు తెలిసింది. పక్కనే ఉన్న యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కూడా జత కలిశారు. అధికారిక కార్యక్రమానికి కూడా పార్టీ సమన్వయకర్తలను పిలిస్తే తమకు ఇక విలువ ఏముంటుందని మండిపడ్డారు. నియోజకవర్గంలో సగం ఎమ్మెల్యేలుగా భావిస్తున్నారా? ఇతర జిల్లాల్లో అధికారిక కార్యక్రమాలకు జనసేన ఇన్‌చార్జి, సమన్వయకర్తలను ఆహ్వానిస్తున్నారా? మమ్మల్ని సగం ఎమ్మెల్యేలుగా అనుకుంటున్నారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై అక్కడే ఉన్న గండి బాబ్జీ, ప్రగడ నాగేశ్వరరావులు కూడా సమాధానం చెప్పడంతో వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు పెద్దగా అరుచుకుంటూ బాహాబాహీకి దిగినంత పనిచేశారు. దీంతో చాంబర్‌లో ఉన్న ఇతర ప్రజాప్రతినిధులు వారికి సర్దిచెప్పడానికి నానా పాట్లు పడ్డారు.

ఎమ్మెల్యేలు వర్సెస్ సమన్వయకర్తలు

2024 ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ నుంచి నాలుగు స్థానాల్లో జనసేన విజయం సాధించింది. ఇక్కడ అనకాపల్లి మినహా విశాఖ దక్షిణం, పెందుర్తి, యలమంచిలి నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేనల మధ్య మొదటి నుంచి విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. బదిలీల నుంచి పోస్టింగ్‌ల వరకు, భూ వ్యవహారాల నుంచి మైనింగ్‌ల వరకు అన్నింట్లోనూ టీడీపీ ఇన్‌చార్జిల ఆధిపత్యం కొనసాగుతోందని జనసేన ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇదే విషయంపై గతంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తన గన్‌మెన్‌ను సైతం పంపించేశారు. అయితే ఇరు పార్టీల అధినాయకులు.. సమన్వయంతో కలిసి పనిచేయాలని వారిని ఆదేశించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఆ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త గండి బాబ్జీ, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఆ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త ప్రగడ నాగేశ్వరరావుల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ.. బయటపడకుండా ఇప్పటివరకు ఉప్పు, నిప్పులా మెలుగుతూ ఉన్నారు. తాజాగా ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఈ సమన్వయకర్తలు హాజరుకావడం జనసేన ఎమ్మెల్యేలకు ఆగ్రహం తెప్పించింది.

అధికారంలోనే ఉన్నామా?

- జనసేన ఎమ్మెల్యే పంచకర్ల.. టీడీపీకి ప్రాధాన్యత ఇవ్వడంలేదు
- గండి బాబ్జీకి సమాచారం లేకపోతే టీడీపీ కేడర్ హాజరు కాదు
- మినీ మహానాడులో జనసేనపై విరుచుకుపడ్డ టీడీపీ నాయకులు

సబ్బవరం/పెందుర్తి: 'తెలుగుదేశం పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్నాం. మొన్నటి ఎన్నికల్లో అధికారంలోకి రావాలన్న ఒకే ఒక లక్ష్యంతో పంచకర్ల రమేష్‌బాబు గెలుపునకు పనిచేశాం. కానీ ఈ రోజు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలను జనసేన నాయకులు చాలా చులకనగా చూస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఎమ్మెల్యే అక్కున చేర్చుకుని అతన్ని గెలిపించిన టీడీపీ కేడర్‌ను ఇబ్బందులు పెడుతున్నారు. మేం అధికారంలో ఉన్నామా.. ప్రతిపక్షంలో ఉన్నామా అని నియోజకవర్గంలోని ప్రతీ కార్యకర్త ఆవేదన చెందుతున్నాడు.'అంటూ టీడీపీ మండల స్థాయి నాయకులు మినీ మహానాడు వేదికగా జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుపై నిప్పులు చెరిగారు. సబ్బవరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మహానాడులో టీడీపీ మండల స్థాయి నాయకులు ఎమ్మెల్యే పంచకర్ల, జనసేన కేడర్‌తో పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. సబ్బవరం టీడీపీ అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో కేవలం వైఎస్సార్ సీపీని ఓడించేందుకు మాత్రమే పంచకర్లతో కలిసి పని చేశామని స్పష్టం చేశారు. కానీ అదే పంచకర్ల ఇప్పుడు ఇతర పార్టీ నాయకులను చేరదీసి టీడీపీ నాయకులను తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇకపై ఎమ్మెల్యే పంచకర్ల నిర్వహించే ఏ కార్యక్రమం అయినా టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీకి నేరుగా సమాచారం ఇవ్వాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని బాబ్జీ తమకు ఆదేశాలు ఇస్తేనే పాల్గొంటామని స్పష్టం చేశారు. మాజీ ఎంపీపీ గండి దేముడుబాబు మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్నామా..ప్రతి పక్షంలో ఉన్నామా అర్థం కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని.. టీడీపీ కార్యకర్తలకే తగిన ప్రాధాన్యం ఉంటుందని టీడీపీ అనకాపల్లి అధ్యక్షుడు తాతయ్యబాబు అన్నారు. టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తానున్నానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండారు వర్గానికి ఆహ్వానమే లేదు.

టీడీపీ మినీ మహానాడుకు మాడుగుల ఎమ్మెల్యే(పరవాడ నివాసి) బండారు సత్యనారాయణమూర్తి వర్గీయులు డుమ్మా కొట్టారు. మహానాడుకు పెందుర్తి మండల అధ్యక్షుడు కరక దేముడు, నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు మడక పార్వతి, జెర్రిపోతులపాలెం సర్పంచ్ మడక అప్పలరాజు సహా పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల నుంచి సీనియర్ టీడీపీ నాయకులకు ఆహ్వానం అందలేదని చెబుతున్నారు. దీంతో మహానాడుకు వారంతా వెళ్లలేదు.

పోర్టు ట్రస్టులో మాక్ డ్రిల్

సీతంపేట: ఉగ్రవాదులు పోర్టుపై దాడికి దిగితే సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో వివరించేలా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ఆక్టోపస్ బృందం బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, వైద్య, అగ్నిమాపక శాఖల సమన్వయ చర్యలను ఉన్నతాధికారులు పరిశీలించారు. ఆక్టోపస్ డీఎస్పీలు బి.కృష్ణ, బి.మధుసూదనరావు, పోర్టు అధికారులు, హార్బర్ సీఐ సిహెచ్.సింహాద్రి నాయుడు, ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సీతంపేట: ప్రధాని మోదీ వచ్చే నెల 21న విశాఖ రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం బీచ్ రోడ్‌లో జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. యోగా డేకు జనం భారీగా రానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు.

సాగరతీరంలో అయోధ్య రామ మందిరం

- నేటి నుంచి సందర్శకులకు అనుమతి



ఏయూ క్యాంపస్: నగరవాసులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు అయోధ్య రామ మందిరం నమూనా సిద్ధమయింది. బీచ్‌రోడ్డులోని పామ్‌బీచ్ హోటల్ పక్కన ఏర్పాటు చేసిన రామ మందిర నమూనాను గురువారం ఉదయం 8.48 గంటలకు పూజా కార్యక్రమాలతో ప్రారంభించనున్నారు. వేదిక వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ మాట్లాడుతూ విశాఖ వాసులకు అయోధ్య రామ మందిరం సందర్శించిన అనుభూతిని పంచేలా 90 అడుగుల ఎత్తు, 392 స్తంభాలు, 44 ద్వారాలతో నిర్మించినట్లు పేర్కొన్నారు. రెండు నెలలపాటు ప్రజల సందర్శనకు ఇది అందుబాటులో ఉంటుందన్నారు. పాలూరి శేషమాంబ, దుర్గా ప్రసాద్, బీజేపీ నాయకులు అశోక్, దిలీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ దూర విద్య.. మిథ్య!

- డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఉత్తుత్తి ప్రాజెక్టులు
- మేనేజ్‌మెంట్ కోర్సుల్లో మాయాజాలం
- వైవా పేరుతో విద్యార్థుల నుంచి వసూళ్లు
- కోర్సులు లేకున్నా కో–ఆర్డినేటర్లుగా చలామణి



ఏయూలోని దూరవిద్య ప్రధాన కేంద్రం

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ దూరవిద్యా విభాగం గాడి తప్పింది. కో–ఆర్డినేటర్ల పేరుతో చలామణి అవుతున్న కొంతమంది ఆచార్యులు దూరవిద్య చదువులను వ్యాపారంగా మార్చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఈ వ్యవహారం బాహాటంగానే జరుగుతోందని తెలుస్తోంది. యూజీ, పీజీ కోర్సులకు ఇటీవలే పరీక్షలు ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 115 స్టడీ సెంటర్ల నుంచి యూజీ కోర్సుల్లో 17,651 మంది, పీజీ కోర్సుల్లో 7,557 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ప్రస్తుతం మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతోంది. విద్యార్థులు సమర్పించిన అసైన్‌మెంట్‌ల మార్కులను కలిపి త్వరలో ఫలితాలను ప్రకటించనున్నారు. అదే విధంగా మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు ప్రాజెక్టులను సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారికి వైవా నిర్వహిస్తారు. ఇదే.. ఇక్కడి కొంత మంది ఆచార్యులకు కాసుల పంట పండిస్తోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ప్రాజెక్టులపై పర్యవేక్షణ కరవు

పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఎంబీఏ, ఎంసీఏ, ఎంహెచ్‌ఆర్‌ఎం, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు మంచి ఆదరణ ఉంది. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించే పీజీ కోర్సుల్లోనూ విద్యార్థులు ఎక్కువగా ఈ కోర్సుల్లోనే చేరుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పని చేసే వైద్యులు సైతం ఇలాంటి కోర్సులను ఎంపిక చేసుకుంటున్నారు. రెండేళ్ల పీజీ కోర్సు పూర్తి చేసే క్రమంలో.. ఆఖరి సెమిస్టర్ పరీక్షలు ముగిసిన తర్వాత మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు తమ ప్రాజెక్టులను యూనివర్సిటీకి సమర్పించాలి. కానీ వీటిపై సరైన పర్యవేక్షణ లేకుండానే మార్కుల మాయాజాలం సాగుతోందని తెలుస్తోంది.

వర్సిటీ కేంద్రంగానే వసూళ్లు

యూజీ, పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థుల నుంచి కొన్ని స్టడీ సెంటర్ల నిర్వాహకులు పాస్ గ్యారంటీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీనిని అరికట్టేందుకు దూరవిద్యా విభాగం ప్రస్తుత డైరెక్టర్ ఎన్. విజయ్ మోహన్ దృష్టి సారించారు. విద్యార్థులు రూపొందించిన అసైన్‌మెంట్‌లు, ప్రాజెక్టు రిపోర్టులను స్టడీ సెంటర్లలో కాకుండా.. ఇకపై నేరుగా వర్సిటీలోనే అందజేయాలని ఆదేశించారు. ఇదే అదునుగా దూరవిద్యా విభాగంలోని కొంత మంది ఆచార్యులు, సిబ్బంది వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు సమాచారం. అంతా తామే చూసుకుంటామని ఒక్కో విద్యార్థి నుంచి రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దూరవిద్యలో పని లేని ఆచార్యులు

దూరవిద్యా కేంద్రంలోని ఆరుగురు ఒప్పంద సహాయ ఆచార్యులకు తగినంత పని లేక ఖాళీగా కాలం గడిపేస్తున్నారని తెలుస్తోంది. జాగ్రఫీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు నిర్వహించకపోయినా.. ఆయా సబ్జెక్టుల ఆచార్యులు ఇక్కడ విధుల్లో ఉండటం గమనార్హం. ఎడ్యుకేషన్ సబ్జెక్టుకు నలుగురు ఒప్పంద ఆచార్యులు, ఒక శాశ్వత మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ కోర్సు ఆరేళ్ల కిందటే రద్దయింది. వీరంతా అసలు పని మానేసి ఇతర సబ్జెక్టులకు కో–ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో దూరవిద్యా విభాగంలో పని చేసే సబ్జెక్టు నిపుణులను విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా అటు దూరవిద్యా కేంద్రంలోనూ, ఇటు వర్సిటీలోని మాతృ విభాగాల్లోనూ విధులు కేటాయించే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పని లేకున్నా, కో–ఆర్డినేటర్ల పేరుతో పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రక్షాళన చేస్తున్నాం



దూర విద్య విభాగాన్ని ప్రక్షాళన చేసే దిశగా వైస్ చాన్సలర్ ఆలోచన చేస్తున్నారు. అసైన్‌మెంట్లను స్టడీ సెంటర్లలో కాకుండా ఇక నుంచి నేరుగా యూనివర్సిటీలోనే అందజేయాలి. విభాగంలోని ఆచార్యుల పనితీరుపైనే పరిశీలన చేస్తున్నాం. త్వరలోనే మార్పులు ఉంటాయి. దూర విద్యలోనూ నాణ్యమైన విద్య అందించేలా స్టడీ సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– ఎన్.విజయ్ మోహన్, డైరెక్టర్, ఏయూ దూరవిద్య విభాగం

బెట్టింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

విశాఖ సిటీ: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ప్రధాన ముద్దాయికి సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ కొద్ది రోజుల కిందట అరెస్టయిన ప్రధాన ముద్దాయి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో విజయనగరం జిల్లాకు చెందిన గండి గణేష్, పల్లి రామకృష్ణ మధురవాడలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. నిందితులు బెట్టింగ్‌కు ఉపయోగించిన రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

బాణసంచా పేలి బాలుడికి గాయాలు


గాయపడ్డ గరికిన నవీన్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేటలో బాణసంచా పేలి ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు మంగమారిపేటలో గ్రామ పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా 7వ తేదీన తీరం వద్ద లంకాదహనం జరిపారు. అది పూర్తి స్థాయిలో కాలలేదు. ఇందులో అమర్చిన కొంత మందుగుండు సామగ్రి పేలకుండా ఉండిపోయింది. ఇదే ప్రాంతానికి చెందిన గరికిన నవీన్(11) అనే బాలుడు మంగళవారం సాయంత్రం లంకా దహనం సెట్ వద్దకు వచ్చి పేలని మందుగుండు సామగ్రిని ఇంటికి తీసుకెళ్లాడు. బుధవారం ఉదయం వీటిలో ఒకదాన్ని వెలిగించాడు. దానికి నిప్పంటించిన వెంటనే ఢాం అని పేలడంతో దాని సమీపంలోనే ఉన్న నవీన్ తల భాగం, ముఖం, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తల్లిదండ్రులు దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. లంకాదహనం అనంతరం మిగిలిన మందుగుండు సామగ్రిని తొలగించడంలో ఉత్సవకమిటీ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉత్సవ కమిటీ తీరును నిలదీస్తున్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో


చీరలను పరిశీలిస్తున్న సందర్శకురాలు

అల్లిపురం: భారతీయ చేనేత, సంప్రదాయ సంపూర్ణ వస్త్రాల ప్రదర్శన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–ఎగ్జిబిషన్ కమ్ సేల్ బుధవారం ప్రారంభమైంది. వేసవికి అనువైన విభిన్న నేత వస్త్రాలను అందుబాటులో ఉంచారు. దేశంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక సంబంధాలు పెనవేసి మగ్గాల పైన నేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉంచారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ నేత వస్త్రాలు, వేలాది రకాల సిల్క్, కాటన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తాలు మొదలైనవి అన్నీ ఒకేచోట కొలువయ్యాయి. వస్త్రాలపై 50 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 26 వరకు రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తగరపువలస: ఆనందపురం ఫ్లై ఓవర్‌పై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతంపేటలో గణేష్‌నగర్‌కు చెందిన గొరుసు నరసింగరావు(52) దుర్మరణం చెందాడు. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు భార్య రమణమ్మతో కలిసి బైక్‌పై భీమిలి మండలం చిప్పాడలోని సుత్తమ్మ తల్లి పసుపు కుంకుమల కార్యక్రమంలో భాగంగా అత్తవారింటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భార్యను బంధువుల ఇంటి వద్ద వదిలేసి నగరంవైపు వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో కారు బైక్‌ను కొంత దూరం ఈడ్చుకు వెళ్లిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. సీఐ వాసునాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28న మోడల్ డీఎస్సీ పరీక్ష

దాబాగార్డెన్స్: యూటీఎఫ్, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్సీ మోడల్ పరీక్ష ఈ నెల 28న నిర్వహించనున్నారు. బుధవారం సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. మోడల్ డీఎస్సీ పేపర్‌ను మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావుచే రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఎస్జీటీ అభ్యర్థులకు మాత్రమే ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 93989 70538, 63022 728 62లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

హంతకుడికి యావజ్జీవ జైలు, జరిమానా

విశాఖ లీగల్ : అత్యాశతో తన యజమానిని హత్య చేసిన లారీ క్లీనర్‌కు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ నగరంలోని 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి సీకే గాయత్రి బుధవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తన తీర్పులో పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు. విజయవాడకు చెందిన నిందితుడు పిండి నాగరాజు, మృతుడు పి.మల్లికార్జునరావు దగ్గర లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. మల్లికార్జున్‌కు సొంత లారీలున్నాయి. 2015 నవంబరు 15న మల్లికార్జునరావు విజయవాడలో లోడ్ ఎక్కించుకుని కోల్‌కతా వెళ్లాడు. అక్కడ కాఫీ లోడ్‌తో విజయవాడ బయల్దేరాడు. అదే నెల 30న సాయంత్రం 5 గంటలకు క్లీనర్/నిందితుడు నాగరాజు యలమంచిలి దగ్గర పూటుగా మద్యం సేవించాడు. డ్రైవర్ కమ్ ఓనర్ మల్లికార్జునరావు విశ్రాంతి తీసుకుంటుండగా బలమైన ఆయుధంతో అతి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని సమీపంలోని పెద్ద కాలువలో పడేశాడు. లారీని విజయవాడ తీసుకెళ్లి, అక్కడ సరకు అందించి డబ్బు కాజేశాడు. తన తండ్రి కనిపించకపోవడంతో మల్లికార్జునరావు కుమారుడు చంద్రశేఖర్ యలమంచిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణలో నాగరాజు నిందితుడిగా తేలాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పించాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఏపీఎస్‌డబ్ల్యూఏఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్

మహారాణిపేట: వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్(ఏపీఎస్‌డబ్ల్యూఏఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్ కోరారు. విశాఖ పర్యటనలో ఉన్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి పి.నారాయణను జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు నాయకత్వంలో కలిసి వినతి పత్రం అందించారు. వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను, ప్రమోషన్ చానల్ అంశాలను మంత్రికి వివరించారు. ఐదేళ్లుగా వార్డులలో విశిష్ట సేవలందిస్తున్న అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సేవలను జూనియర్ అసిస్టెంట్లుగా పరిగణించి, అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. తదుపరి ప్రమోషన్‌కు సంబంధించి నోడల్ లేదా జోనల్ స్థాయిలో కొత్త పోస్టులను సృష్టించి, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌లో పదోన్నతి కల్పించాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగార్రాజు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బి.వి.అశోక్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సాయికృష్ణ, జాయింట్ సెక్రటరీ పవన్‌కుమార్, నాయకులు డి.రవితేజ, నానాజీ, బి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

సింహాచలం ప్రధానార్చకుడు కన్నుమూత


ఇరగవరపు వెంకట రమణాచార్యులు(ఫైల్)

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు ఇరగవరపు వెంకట రమణాచార్యులు (58) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయనకు ఈ నెల 19న గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో మరణించారు. అడవివరం శ్మశానవాటికలో బుధవారం మధ్యాహ్నం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, రమణాచార్యులు 1992లో అధ్యాపకుడిగా సింహాచలం దేవస్థానంలో ఉద్యోగంలో చేరారు. 1994లో అర్చకుడిగా, 2020లో ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందారు. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి జరిగే వార్షిక ఉత్సవాలు, నిత్య పూజల నిర్వహణలో రమణాచార్యులు తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. ముఖ్యంగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవం రోజుల్లో జరిగే ఎదురు సన్నాహోత్సవ ఘట్టంలో పూలదండలతో ఆయన చేసే నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. రమణాచార్యులకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. దేవస్థానం ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాసరావు, వైదికులు, అధికారులు, ఉద్యోగులు, అడవివరం గ్రామస్తులు రమణాచార్యుల పార్థివదేహానికి నివాళులర్పించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

యోగానే దానికి మార్గం

- విశాఖ సాగర తీరాన యోగాసనాలు
- బీచ్‌రోడ్డులో 'యోగాంధ్ర'కు శ్రీకారం


యోగా సాధన చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మేయర్ తదితరులు

ఏయూ క్యాంపస్: విశాఖ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నాహకంగా 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లి.. యోగాను దైనందిన జీవితంలో భాగం చేసేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. 'గ్రామీణ స్థాయికి యోగాను తీసుకువెళ్లే విధంగా విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తాం. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా సహకారంతో యోగా ట్రైనర్లకు వారం రోజుల సర్టిఫికెట్ శిక్షణ అందిస్తాం. వారి ద్వారా గ్రామ సచివాలయ స్థాయిలో ప్రజలకు మూడు రోజుల పాటు శిక్షణ అందించేలా కార్యక్రమాలు చేపడతాం.' అని కలెక్టర్ వివరించారు. జల యోగా వంటి ప్రత్యేక అంశాలను కూడా ఈ ప్రణాళికలో భాగం చేసి.. ప్రజలను ఆకట్టుకునేలా నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ ప్రధాని మోదీ కృషితో యోగాకు ప్రపంచవ్యాప్తంగా విస్తృత ప్రాచుర్యం లభించిందన్నారు. ప్రపంచ దేశాలు భారతీయ యోగాను ఆచరిస్తున్నాయన్నారు. నెలరోజుల పాటు విస్తృత స్థాయిలో యోగా సాధన చేయడం ద్వారా గిన్నిస్ రికార్డును సాధించే దిశగా కూడా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ నేటి ఒత్తిడితో కూడిన జీవనంలో మనసును అదుపులో ఉంచుకోవడానికి యోగా ఒక అద్భుతమైన సాధనమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ వల్ల ప్రపంచ పటంలో విశాఖకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో బి.హెచ్. భవానీ శంకర్, ఆయుష్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, పలువురు జిల్లా అధికారులు, నగరవాసులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

నిండు నూరేళ్ల జీవితం

- 100వ జన్మదినం, 71వ వివాహ వార్షికోత్సవం
- ఓల్డ్‌సిటీ వెలంపేట వాసి మొకర అప్పారావు ఘనత


మొకర అప్పారావు, ఎర్రమ్మ దంపతులు

దాబాగార్డెన్స్: సాధారణంగా పెద్దలు దీవించేటపుడు శతాయుష్మాన్‌భవ అని అంటారు. అంటే.. నూరేళ్లు చల్లగా బతకాలని. అలాంటి దీవెనలందుకున్న వ్యక్తే.. నగరంలోని ఓల్డ్‌సిటీ వెలంపేటకు చెందిన మొకర అప్పారావు. 1925 మే 21న జన్మించిన ఆయన బుధవారం శత వత్సర జన్మదినంతోపాటు, 71వ వివాహ వార్షికోత్సవాన్ని కూడా భార్య, పిల్లలు, మనవళ్లు, మనవరాళ్ల మధ్య ఆనందంగా చేసుకున్నారు. ఇందుకు దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన వేదిక కేంద్రంగా మారింది. కొడుకు, కోడలు మొకర అప్పలరాజు, మణి ఆహ్వానం మేరకు బంధుమిత్రుల సమక్షంలో అప్పారావు, ఎర్రమ్మ దంపతులు 71వ వివాహ వార్షికోత్సవాన్ని, అప్పారావు శత సంవత్సర జన్మదినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అప్పారావు తన వారసులు, బంధుమిత్రులనుద్దేశించి మాట్లాడుతూ వందేళ్ల తన జీవితంలో చూసిన కష్టనష్టాలు, ఆనందోత్సాహాలను గుర్తు చేసుకున్నారు. స్కూల్ జీవితం, మిత్రులు, తోబుట్టువులతో గడిపిన ఆనంద క్షణాలు, వ్యాపారం, సేవా కార్యక్రమాలను చెప్పుకుంటూ ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. బంధువులు, శ్రేయోభిలాషులు ఆ దంపతుల ఆశీస్సులందుకున్నారు. అప్పారావు, ఎర్రమ్మ దంపతులచే కేక్ కట్ చేయించి, విందు భోజనాలు ఆరగించారు.

పేదరికమే దశ్వంత్ పాలిట శాపం


రెడ్డి దశ్వంత్(ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం చందకలో కిరాణాషాపులో పనికి వెళ్లి ఫ్రిడ్జ్ డోర్ తెరిచినప్పుడు విద్యుదాఘాతానికి గురై మంగళవారం మరణించిన రెడ్డి దశ్వంత్(13) ఘటనలో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. పేదరికమే ఆ బాలుడి పాలిట శాపమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీ డ్రైవర్ అయిన రెడ్డి శివ, కుమారి దంపతుల ఇద్దరు కుమారులలో పెద్దవాడైన దశ్వంత్ ఆరో తరగతి పూర్తి చేసుకుని, వేసవి సెలవులు ఇచ్చినప్పటి నుంచి కిరాణా షాపులో పనికి వెళ్తున్నాడు. కుటుంబానికి చేదోడుగా ఉంటూ, నూతన విద్యా సంవత్సరంలో అవసరమైన వస్తువులు కొనుక్కోవాలనే కిరాణా షాప్‌లో పనికి వెళ్తున్నట్టు తెలిసింది. గడచిన విద్యా సంవత్సరంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తామన్న తల్లికి వందనం పథకాన్ని మాటలతోనే కాలం గడిపేసింది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు కృషి చేయాల్సిన విద్యాశాఖ, కార్మికశాఖ దశ్వంత్ విషయంలో పూర్తిగా విఫలమైంది. విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన తర్వాత కూడా స్థానికంగా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న ఇద్దరు వ్యక్తులు కేసును పక్కదారి పట్టించే పనిలో ఉన్నారు. షాపు యజమానితో కుమ్మక్కై దశ్వంత్ మంగళవారం షాపుకే రాలేదని, టిఫిన్ చేయడానికి వచ్చి వాటర్ బాటిల్ కోసం ఫ్రిడ్జ్ డోర్ తెరిచే సమయంలో షాక్‌కు గురైనట్టు వాస్తవాలను మరుగున పరిచే ప్రయత్నం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన ఆనందపురం పోలీసులు కిరాణా షాపులో గత రెండు రోజులుగా ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తే వాస్తవాలు బయట పడతాయని స్థానికులు చెప్తున్నారు. దశ్వంత్‌కు జరిగిన అన్యాయం మరే బాలుడికి జరగకుండా సంబంధిత శాఖలు దృష్టి సారించాలని కోరుతున్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఎలుకల మందు తాగిన నిందితుడు

ఎంవీపీ కాలనీ: మద్దిలపాలెం చైతన్యనగర్‌కు చెందిన గొలగాని గాయత్రి(22)ని వేధింపులకు గురిచేస్తున్న మారుపిల్లి సాయి అనే వివాహితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు.. ద్వారకానగర్ పిరమల్ ఫైనాన్షియల్ కంపెనీలో గాయత్రి పనిచేస్తోంది. ఉద్యోగ క్రమంలో ఆమెకు మారుపిల్లి సాయితో పరిచయం ఏర్పడింది. ప్రేమ, పెళ్లి పేరిట 2023 నుంచి గాయత్రిని లైంగికంగా లోబరచుకున్నాడు. ఆమె నుంచి పలు విడతలుగా రూ.6 లక్షల నగదు, 5 తులాల బంగారం తీసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని కొంతకాలంగా నమ్మిస్తూ వచ్చాడు. నగదు ఇవ్వాలని కోరడంతో బెదిరింపులకు దిగాడు. ఇటీవల రూ.2 లక్షలు ఇచ్చాడు. మిగిలిన మొత్తం అడిగితే చంపేస్తానని బెదిరిస్తున్నట్లు బాధితురాలు తెలిపింది. అప్పటికే అతనికి పెళ్లైనట్లు ఇటీవల తెలియడంతో మోసపోయినట్లు గ్రహించిన గాయత్రి ఎంవీపీ పోలీసులను మంగళవారం ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

స్టేషన్‌లో ఎలుకల మందు తాగిన నిందితుడు

దర్యాప్తులో భాగంగా ఎస్ఐ ఎం.శ్రీనివాస్ మంగళవారం రాత్రి నిందితుడు సాయిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. గాయత్రి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని, కేసు నమోదు చేస్తే స్టేషన్లోనే చచ్చిపోతానంటూ పోలీసులపై నిందితుడు బెదిరింపులకు దిగాడు. ఈ క్రమంలో పోలీసులు మందలించడంతో తన వెంట తెచ్చుకున్న ఎలుకల మందును తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో పోలీసులు వెంటనే అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఘటనపై ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు'పై చంద్రబాబు మౌనం ఎందుకు?

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రశ్న
- దీక్షను భగ్నం చేసిన పోలీసులు


ఉక్కు దీక్ష శిబిరంలో ఆమరణ దీక్ష చేస్తున్న షర్మిల

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రంలోని బీజేపీతో కూడిన కూటమి ప్రభుత్వం చిన్నాభిన్నం చేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల ప్రశ్నించారు. కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి సంఘీభావంగా బుధవారం ఆమె నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. స్టీల్‌ప్లాంట్ భూములను ప్రభుత్వ పెద్దల బినామీ సంస్థ అదానీకి ద్వారా సొంతం చేసుకోడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులను తొలగింపు ద్వారా కార్మికుల్లో మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలా చేయడం యాజమాన్యం ఉద్దేశమన్నారు. బీజేపీని భుజాన వేసుకుని మోస్తున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించకుండా ఉన్నారంటే ఆంతర్యం ఏంటో ప్రజలకు అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామారావు, విజయ్‌చంద్, జెర్రిపోతుల ముత్యాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా.. షర్మిల చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను రాత్రి 9.30 గంటలకు పోలీసులు భగ్నం చేశారు. డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ త్రినాథ్ నేతృత్వంలో పోలీసులు ఆమెను నగరానికి తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వారిని పక్కకు నెట్టి షర్మిలను వాహనంలో తరలించడంతో అంతా సద్దుమణిగింది.